# పోయిన గడియారం

నాకు బాగా జ్ఞాపకం, రాత్రి నేను పడుకునేటప్పుడు చేతికి వాచ్ వుంచుకునే పడుకొన్నాను. కానీ పొద్దున్నే లేచిచూస్తే లేదు. పక్కమీది నుంచి ఒక్క గంతువేసి, దుప్పటీ పరుపూ అన్నీ దులిపాను. మంచం క్రిందా, మీదా అంతా కలియ వెదికాను. గది నాలుగు మూలలా, నాలుగు కళ్ళతో గాలించాను. కనపడలేదు. మరి ఇంతకీ ఏమయింది?

నేను పోయిన రెండు సంవత్సరాల నుంచి, ప్రెస్సు మీదిభాగంలో ఒక రూంలో ఏ భయం లేకుండా వుంటున్నాను. నాకు తెలిసినంతవరకూ, ముందెప్పుడూ ప్రెస్సులో గానీ, నా రూంలో గానీ, యిటువంటిదేమీ జరగలేదు. నా రూంప్రక్కనే నలుగురు కాలేజీ స్టూడెంట్సు వుండేవాళ్ళు. వాళ్ళకోరకు వాళ్ళ ఫ్రండ్స్ వస్తూ పోతూ వుండేవాళ్ళు. అయినప్పటికీ ఎప్పుడూ నేను నా గది తాళం వెయ్యకుండా, తెరిచే వుంచేవాణ్ణి. కానీ ఇంతవరకూ నా గదిలోనుంచి ఒక చీపురుపుల్ల కూడా పోలేదంటే నమ్మండి!

అసలు ఆ వాచి మనది కూడా కాదు, పోతేపోయిందిగదా అని, విచారించి వూరుకోటానికి. పాత స్నేహితుడు గోపాలం, మొన్ననే కొత్తగా కొని చేతికి పెట్టుకొని తిరుగుతుంటే చూచి, నాకు కూడా రెండు రోజులు అట్లా పెట్టుకొని తిరగాలని బుద్ధి పుట్టింది. అడగ్గానే లేదనకుండా పాపం! నామీదవున్న ప్రేమ చేతనే అనుకోండి, లేక పాతస్నేహితం చేతనే అనుకోండి, లేక మాట తీసివేయలేకనే అనుకోండి, మొత్తానికి, లేదనకుండా యిచ్చాడు.

వెంటనే బనియనుమీద గోపాలం వుంటున్న రూంకు పరిగెత్తాను. "ఒరేయి. నీ వాచి ఎవడో కొట్టేశాడురా!" "అరే! ఎట్లా!" ఆశ్చర్యంతో అడిగాడు. జరిగిందంతా చెప్పాను, గోపాలం కొంచెం ఆలోచించి "ఒరేయి! రాత్రి నువ్వు పడుకునేటప్పుడు అసలు చేతికి గడియారం వుందా?" అని క్రాస్ చేయటం మొదలుపెట్టాడు. నేను "పడుకునేటప్పుడు వుంది" అని జవాబిచ్చాను. "ఒకవేళ మర్చిపోయావేమో, బాగా జ్ఞాపకం చేసుకో". "నాకు బాగా జ్ఞాపకం రాత్రి పడుకునేటప్పుడు గడియారం చేతికే వుంది!" అన్నాను. గోపాలం కొంచెంసేపు తీవ్రంగా నావైపు చూచి, దగ్గరగా కుర్చీ జరుపుకొని "నిజం చెప్పరా! నాకు అన్నీ తెలుసు. నీకన్న ఎక్కువ అనుభవం కలవాడినే. ఇంతకీ దాన్ని ఏ...ప్రియురాలికి దానం చేశావు." నాకు ఈ మాట వినగానే ఒళ్ళు మండిపోయింది. నేను కోపంతో "ప్రియురాళ్ళు ఎవర్రా, పిండాకూడు వాళ్ళు; అసలు అది..." నా మాట పూర్తి కాకముందే, భుజంమీద చేతితో తట్టుతూ "నాదగ్గర దాయకు. మనిషి అన్న తరువాత తప్పులు చేస్తూనే వుంటాడు. కొందరు పెద్ద తప్పులు చేస్తారు. కొందరు చిన్నవి. అంతే!" అని గోపాలం అంటున్న వేదాంతం వినేసరికి నా బుర్ర వేడెక్కిపోయింది.

గడియారం పోయిన సంగతి క్రింద ప్రెస్సులో పనిచేస్తున్న నాస్నేహితులందరికీ తెలిసిపోయింది. "ఎట్లా పోయింది ఎట్లా పోయింది" అని అడిగే వాళ్ళకు సమాధానం చెప్పలేక, నేను నా రూంకు వెళ్ళి ఏమి చేయటమా అని



"సర్పరాజు"    ఫోటో :—శ్రీ హరిసత్యం.

ఆలోచిస్తూ కూర్చున్నాను. ఇంతలో క్రింది ప్రెస్సులోని పత్రికా సంపాదకులు గారు, నా రూంకువచ్చి, ముందు గడియారం పోయినందుకు విచారం చూపి ఎట్లాపోయిందని అడిగారు. నేను జరిగినదంతా తూచ తప్పకుండా వారికి చెప్పాను. రామాయణం విన్న తరువాత; 'రాముడికి సీత ఏమవుతుంది' అని ఎవరో మహానుభావుడు అడిగినట్లు, మా సంపాదకుడుగారు గడియారం ఎక్కడ పెట్టి పండుకున్నావు అని మళ్ళీ అడిగారు. "చేతికే" అని జవాబిచ్చాను. ఈమాట విన్నతిరువాత వారు లేచి గదిలో అటూ యిటూ తిరుగుతూ, ఏదో ఆలోచించి, గదిలోవున్న వస్తువులన్నీ కిందామీదా చేసి చూశాడు. పక్కకూడా దులిపాడు. ఆఖరికి నామీదవున్న చనువుకొద్ది "నీవంటి ప్రపంచజ్ఞానం వున్నవాళ్లు అట్లా నిర్లక్ష్యంగా చేతికి గడియారం పెట్టుకొని పడుకోవటం ఏమీ బాగాలేదు" అన్నాడు. "అవునండి, చేతికి వాచ్ పెట్టుకొని బయట పడుకోవటం నిజంగాతప్పే," అని అన్నాను. "తప్పని చిన్నగా అంటారేమిటి. చాలా పెద్ద తప్పు. ఎటు లేదన్నా వాచ్ 60, 70 రూపాయలకేం తక్కువ వుండదు. అసలు రోజులు ముందులాగలేవు. ఇప్పుడు ప్రతివానికి స్వార్థం ఎక్కువై పోయింది. ఇదంతా తెలిసికూడా మీరు.." అని ఆపేశారు. "అవునండి తెలిసికూడా గోతులో పడ్డాను" అని నీళ్ళు నములుతూ నేను అనగానే వారు వెంటనే మొదలు పెట్టారు, "నన్ను చూడండి, దగ్గరదగ్గర 40 ఏండ్లు వచ్చినయి. ఇంతవరకు ఒక చిన్న గుండుసూది కూడా నేను పోగొట్టుకోలేదు. నా వస్తువులన్నీ జాగ్రత్తగా వుంచుకోవటం బాగా తెలుసు. అట్లా జాగ్రత్తగా వుంచుకోవటం తెలియకపోతే, ఇంత పెద్ద చదువు చదివి ఏం లాభం? నేను రోజూ సాయంత్రం యింటికి వెళ్ళగానే, మా శ్రీమతి గార్కి, వస్తువులన్నీ భోషాణంలాగ వున్న ట్రంకులో పెట్టి తాళం వెయ్యమని ఆర్డరిస్తాను. ట్రంకులో పెట్టి తాళం వెయ్యడంవల్లనే, యింతవరకూ ఏ చిన్న వస్తూవూ పోలేదు. మీరుకూడా వాచ్ ట్రంకులో పెట్టి పండుకున్నట్లయితే, అది ఇన్వాళ మీదగ్గిరే వుండేది. అని చిన్న లెక్చర్ యిచ్చి "సరేనోయ్. టైం అయింది వెళ్లోస్తాను" అంటూ వెళ్ళిపోయారు. నిజంగా సంపాదకులుగారు అన్నట్లు, ట్రంకులో పెట్టినట్లయితే వాచ్ వుండేదేమో! ఇంత చిన్న విషయంకూడా నా మట్టిబుర్రకు తట్టలేదు. నిజంగా అప్పుడు నామీద నాకే కోపం వచ్చింది.

ఇదే విషయం ఆలోచిస్తుండగా, టైపిస్టు




బుద్ధుని జీవకారుణ్యం

—శ్రీమతి జానకి (విజయవాడ)

# పోయిన గడియారం

సోమశేఖర్ వూడిపడ్డాడు. రాగానే, వాచ్ పోయినందుకు "పాపం!" అని సానుభూతి ప్రకటించాడు. "ఈ వెధవ కబురు వినగానే, చాలా విచారం కలిగింది బ్రదర్" అన్నాడు. నేను విషయం మరిపిద్దామని, 'సరేకానీ, ఎక్కడనుంచి రావటం" అన్నాను. "ఇంటినుంచే వస్తున్నా, ఇక్కడికి రాగానే ఇటువంటి వెధవకబురు వింటానని నాకేం తెలుసు. సరే కానీ వాచ్ ఎక్కడపెట్టి పడుకున్నావు రాత్రి?" అని ప్రశ్నించాడు. అసలు ఈ ప్రశ్నకు ఏం సమాధానం చెప్పాలో తోచక తికమకపడ్డాను. చేతికి పెట్టుకొని బయట పడుకున్నానంటే, మా సంపాదకులుగారు అన్నట్లు వీడుకూడా తెలివి తక్కువ దద్దమ్మ—అంటాడేమోనని" పెట్టెలో పెట్టితాళంవేసి బయట పడుకున్నాను" అన్నాను. నాఈ జవాబు వినగానే సోమశేఖర్ నవ్వుతూ "అట్లా చెప్పు నిజంగా నీది ఒట్టిమట్టి బుర్ర - అంటేనమ్ము వాచ్‌ని ఎవరయినా పెట్టెలో పెట్టి తాళం వేసి పడుకుంటారా? తెలివి తక్కువ దద్దమ్మ; ఖరీదుగల వస్తువులన్నీ, ఎప్పుడూ ఎవ్వరి వూహకూ అందని స్థలంలో పెట్టాలి. నీవు వాచ్‌ని ఏ పుస్తకాల బీరువాలోనో, ఏ పుస్తకం సందులో పెట్టినా బాగుండేది. దొంగకి అసలు పుస్తకాల బీరువాలోకానీ, పుస్తకాలలో గాని, ఏదైనా ఖరీదుగల వస్తువు భద్రపరిచి వుంటుందనే - అనుమానం తట్టదు". నిజంగా సోమశేఖర్ చెప్పింది కూడా బాగానే అగుపించింది. ఉద్యోగానికి టైం అవటంవల్ల శేఖర్ వెళ్ళిపోయాడు.

పది అవుతుంది-నేను మొఖం అన్నా కడుక్కొనిబయటికిపోదామనిలేస్తుండగా, ప్రక్కగదిలోవుంటున్న స్టూడెంట్ ప్రసాద్ రానేవచ్చాడు. "ఏమండి, వాచ్ ఎట్లాపోయింది, ఎక్కడ పెట్టి పడుకొన్నారు?" అందరూ అడిగినట్లు అతనూ అడిగాడు. నేను వెంటనే తడుముకోకుండా "పుస్తకాల బీరువాలో, పుస్తకాల సందులో పెట్టాను" అన్నాను. ఈమాట వినగానే ప్రసాద్ నవ్వటం మొదలు పెట్టాడు." ఏమండీ, అది బీరువాలో పెట్టేవస్తువా? అదికాక మీరు చాలా నవల్లో చదివుంటారు, దొంగలు ముఖ్యంగా బీరువాలన్నీ గాలించి వదిలిపెడతారని. తెలిసికూడా పప్పులో కాలువేశారు. వాచ్‌ని భద్రంగా, ఎట్లాదాచి పెట్టాలంటే, మనం పడుకునేటప్పుడు, దిండుక్రిందపెట్టి పడుకుంటే; దొంగ గేమిటి, దొంగ అబ్బకుకూడా, వాచ్ ఎక్కడుందీ తెలిసేదికాదు" అని అసిస్టెంట్ కూడా నా తెలివికి నవ్వటం మొదలు పెట్టాడు. స్కూల్ టైం అవటంవల్ల— అతనుకూడా వెళ్ళిపోయాడు.

లేచి మొఖం కడుక్కొని, కాఫీ తాగుదామని బజారుకు బయలుదేరాను. దారిలో స్నేహితుడు సబ్ ఇన్‌స్పెక్టర్ కేశవ్ కలిసి "ఏం రా! వాచ్ పోయిందట. ఎట్లా పోయింది?" అని అడిగాడు. నేను ఆశ్చర్యంతో "నీకు ఎట్లా తెలిసిందిరా!" అన్నాను. "గోపాలం చెప్పాడులే. ఇంతకీ అది ఎక్కడ పెట్టి పడుకున్నావు." "పడుకునేటప్పుడు, దిండు కింద పెట్టి పడుకున్నాను." ఈమాట వినిఇతను కూడా విరగబడినవ్వటం మొదలు పెట్టాడు. నవ్వు ఆపుకొని "నేను దొంగతనాల్ని గురించి చాలా పుస్తకాలు చదివాను. దొంగల మనస్తత్వం నాకు బాగా తెలుసు. నీవు వాచ్‌ని దిండుక్రింద పెట్టి పడుకున్నావు. సగం తెలివైన పనే చేశావు. కానీ పూర్తిగా కాదు. అసలు పడుకున్నవాడు చచ్చినవానితో సమానమంటారు.

"ఒకవేళ నిద్రలోతల దిండుమీదినుంచి జరిగిపోయిందనుకో, అప్పుడేం చేస్తావు? దొంగ చూశాడంటే ఒదిలిపెట్టాడా, ఒదిలి పెట్టడు. అందుకని ఇంతకీ నేను నీకు చెప్పేది ఏమిటంటే, వాచ్‌ని చేతికి పెట్టుకొని నిశ్చింతగా నిద్రపో. దొంగ వెధవలకి మన చేతిగడియారం తీయటానికి గుండె లెక్కడివి? ఇకముందు ఇటువంటి తెలివి తక్కువ పనులు చెయ్యకు. వెళ్ళొస్తాను. గుడ్ బై" అంటూ వెళ్ళిపోయాడు. ఆఖరికి కథ, 'ఉయ్యాల వూగి వూగి ఒకే చోటుకు చేరుతుందన్నట్లు' నా కథ కూడా తిరిగి మళ్లీ మొదటికే చేరుకుంది. కేశవ్ సలహా వినగానే ఉదయంనుంచి వాచ్ పోయిందని విచారంతో వుంటున్న నాకు, ఒక్కసారి ఎక్కడలేని నవ్వు వచ్చిందంటే నమ్మండి. కాఫీ హోటల్‌లో దూరి, ఇదే విషయం ఆలోచిస్తూ, వేడి వేడి కాఫీ తాగ్గానే నాలుక చురుక్కుమంది... ★

వెనుక ఒకసారి మురికి వానలు కురిసినప్పుడు గ్రాండ్ ట్రంక్ రోడ్డువంటి పెద్దరోడ్డు మీద అనేక తావుల్లో గండ్లు ఏర్పడ్డాయి. ఆ గండ్లను పూడ్చేందుకు ప్రభుత్వం హైవేస్ శాఖ వుద్యోగులను సరగున పంపించింది.

అలా వెళ్ళిన ఒక జట్టు 15 అడుగుల లోతు 18 అడుగుల వెడల్పు గల ఒక గండిని పూడ్చవలసివచ్చింది. వాళ్లు ఎంత ప్రయత్నంచేసినా అది సాధ్యపడ లేదు. ఆ జట్టు తాలూకుపెద్ద, ప్రభుత్వానికి యీ విషయాన్ని ఎరుక పరుస్తూ, తనవద్దవున్న మనుష్యులతో ఆ పని అయ్యేటట్లు లేదు కనుక అదనంగా మనుష్యలను పెట్టుకోవటానికి మంజూరు యిప్పించమని వేడుతూ ఒకజాబు వ్రాశాడు.

వారం రోజుల తరువాత ప్రభుత్వం ఆ జాబుకి సమాధానం యిస్తూ, ప్రస్తుత ఆర్థిక పరిస్థితులలో అదనపు వ్యయం తాము భరించలేరు కనుక, వున్న మనుష్యులను తీసివేసి వారిస్థానే 15 అడుగుల పొడవున్న మనుష్యులను వేసుకొని వారిద్వారానే ఆపని చేయించవలసిందిగా సూచించారు.